సౌదా ప్రేమగీతం

ఇప్పుడీ వసంతం వచ్చి కిటికీరెక్కల్ని తోసింది
ఎంతచెప్పినా వినిపించుకోకుండా ఓ కోయిల కూసింది
తలుపులోని ద్వారపు కొండల మలుపుల్లోంచి
సెలయేరొకటి హడావుడిగా పరుగు తీసింది.

ప్రియతమా, ఇక ప్రశ్నలతో కాలక్షేపం వద్దు
ప్రిదిలిపోయే క్షణాలన్నీ తీవ్రవాంఛా సుగంధంలో అద్దు.

జన్మాంతర వాసనా తటిల్లతల నడ్డగించే నీ శిరోజాల నీరదాల
సందోహాలు పక్కకొత్తిపట్టి సందేహాలు కాస్తా కట్టిపెట్టి
నా తలమీది జ్ఞాపకాల మూటచూడు, నిన్నటి పాటపాడు—
నీ సౌందర్య కిరణ ప్రసారంలో వెల్లబారినవాణ్ణి
నీ చూపుల రంపాలచే కోయబడ్డవాణ్ణి.

జీవితం పన్నిన వ్యూహంలోంచి తప్పించుకున్నాం—మనదే భవిష్యత్తు
ఈ వసంతం యుగాంతం దాకా వుండేట్టు చేశానులే బందోబస్తు
నిశ్శబ్దంలో ప్రేలిన ముద్దులో ప్రపంచపు యథార్థాలన్నీ మండిపోయి
స్నిగ్ధ స్వప్నాలు పూస్తున్నాయి, ఒడినిండా దూసుకో.

నక్షత్రాల సందుల్లోంచి నగ్నంగా నవ్వే ఆకాశంకింద
నన్ను కవ్వించే నీలోని దివ్య రహస్యాలను విప్పనీ
బుజంమీదపడే జూకామల్లె తీగతో నిన్ను కట్టివేసి
నిజంగా మన కలయిక అద్వితీయమని చెప్పనీ.

—పణతుల రామచంద్రయ్య

బేరగాడు

హితశ్రీ

టైపిస్టు నీరజకి తప్ప, ఆ ఆఫీసులోని ఉద్యోగులందరికీ, ఆఫీసు గడియారం పొద్దున్న కొట్టే పదిగంటలూ విషాదగీతంలా, సాయంత్రం కొట్టే ఐదు గంటలూ హుషారైన డ్యూయెట్‌లా వినిపించటం రివాజు. నీరజకిమాత్రం తన పనేమో, తన లోకమేమో. గడియారంవంక చూచి ఎరుగదు. కాని ఆ సాయంకాలం ఆమెకే గడియారం గంటలు డ్యూయెట్ గానంలా వినిపించాయి. వెంటనే టైప్‌రైటర్ కట్టేసి, వ్యానిటీ బ్యాగ్ తీసుకుని ఆఫీసుభవనం బయటికి వచ్చేసింది. ఆమె మనసంతా ఉత్సాహంతో నిండిపోయింది. ఆ రోజు రెండునెలల బోనస్ ఇచ్చారు.

నీరజ మనసుని ఏవో ఆలోచనలు అగరువత్తుల దట్టమైన ధూపంలా ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. నెమ్మదిగా అడుగులువేస్తున్న నీరజకి దగ్గరగావచ్చి ఓ రిక్షావాలా ఆశగా గంటు మోగించాడు. ఆమె తలెత్తి చూసింది. రిక్షావాలా ఆశగా చూశాడు. ఆమె అడ్డంగా తల ఆడించింది. రిక్షావాలా నిరాశతో వెళ్లిపోయాడు. అది గమనించిన నీరజకి క్షణం మనసు చివుక్కుమంది. అతన్ని పిలిచి రిక్షాఎక్కి వెళ్దామనుకుంది. కాని తను ఆ రోజు తీరిగ్గా నడవాలి. బజారుమీదుగా పోతూ రోడ్డుకి రెండు వైపులా ఆకర్షణలతో ఆహ్వానించే దుకాణాల్ని చూస్తూ నడవాలి. నాలుగు వందల రూపాయలు బోనస్ వచ్చింది. కావలసిన మంచి మంచి వస్తువుల్ని కొనుక్కొని ఇంటికి ఆనందంతో వెళ్ళాలి. అన్నట్టు కొనాల్సిన వేమిటి? అమ్మకి మంచి చీర, గోపీకి శ్లాక్‌కి సరిపడే టెరిలిన్ క్లాత్. తనవాచీకి బ్యాంగిల్ స్ట్రాపు. హైహీల్డ్ షూజ్, నైలెక్స్ —

నీరజ ఆలోచనలకి అకస్మాత్తుగా అంతరాయం కలిగింది. హారన్ మోగిస్తూ, ఆమెకి చేరువగా కారు ఆపి డ్రైవర్ సీటులో కూర్చున్న వ్యక్తి, కిటికీలోంచి తల బయటికి పెట్టి "హల్లో మిస్ నీరజా" అన్నాడు. నీరజ త్రుళ్లిపడి తలెత్తి చూసింది. వెంటనే పెదవుల మీదికి చిరునవ్వు తెచ్చుకుంది. ప్రకాశం మందహాసం చేశాడు.

"నమస్తే"

"ఇంటికేనా ? డ్రాప్ చేస్తాను, రండి."

అతను డోర్ తెరవబోయాడు.

"థ్యాంక్స్. కొంచెం షాపింగ్ ఉందండి. క్షమించండి."

నీరజ ముందుకి సాగబోయింది.

"పరవాలేదు. కొంచెమేగా ! వెయిట్ చేస్తాను." అతను కొంచెం నవ్వి, ప్రాధేయ పూర్వకంగా అన్నట్టు అన్నాడు. నీరజకి విసుగు పుట్టింది. గట్టిగా విదిలించుకోటానికి వీల్లేదు.

అతను ఆఫీస్ సెక్రెటరీకి దగ్గిర చుట్టం. మంచి బిజినెస్ చేస్తున్న ఇంజనీరింగ్ కంట్రాక్టరు. బి. ఇ. చదివిన విద్యాధికుడు. తరుచు ఆఫీసుకివచ్చి సరదాగా అందర్నీ పలకరించి తన హాస్యధోరణితో అందర్నీ నవ్వించి కాలక్షేపం చేసిపోతుంటాడు. అతనంటే తనకే ఎందుకో చిరాకు. ఏమాట మాట్లాడినా తనెలా ప్రభావితురాలైందీ అతను కనిపెడుతూ, తన అనుగ్రహంకోసం పడిగాపులు కాస్తున్నట్టు కనిపిస్తాడు. నిజానికి అతని అంతస్తుకి తన అంతస్తుకీ హస్తిమశకాంతరం. అతనలా ఎందుకు ప్రవర్తిస్తాడో దురూహ్యం. ఏంచేతంటే, మర్యాద సరిహద్దూ దాటి అతనెప్పుడూ పోలేదు.

"ఏమిటి, ఆలోచిస్తున్నారు. ఈ రోడ్ సైడ్ న పార్కు చేస్తాను. త్వరగా వచ్చేస్తారా?"

నీరజకి ఏమనాలో తోచలేదు. అతన్నించి తప్పించుకోటానికి మార్గాలు ఆలోచించ సాగింది.

"ఏమిటండీ ఆలోచన ? కారు అరిగిపోతుందనా. మీరు అలిసిపోతారనా?" అతను నవ్వుతూ అన్నాడు.

"అలా ఎగ్జిబిషన్ దాకా వెడతానండీ." చటుక్కున మెరుపులా ఆలోచనరాగా, నీరజ సాకు చెప్పింది.

"ఇంకేం నేనూ అక్కడికే బయల్దేరాను. ఆ షాపింగ్ అక్కడే కానియ్యవచ్చు, లోపలికి రండి" అంటూ అతను ఆమె సమాధానం కోసం ఎదురుచూడకుండా బ్యాక్ డోర్ తెరిచాడు. ఇక చేసేది లేక నీరజ అయిష్టంగానే కారెక్కి సీటుకి చేరగిలబడ్డది. ఏవేవో కొనుక్కొని ఇల్లుచేరాలని సముద్రపుటలలా ఉత్సాహంగా తను వెడుతుంటే ఈ ప్రకాశం అనవ్యక్తి ఒడ్డులా అడ్డుపడి తన సంతోషాన్ని పాడుచేశాడని ఆమెకి కసిగా ఉంది. అతని ఉద్దేశమేమిటో, ఇలా తన దారికి అడ్డు రావటమెందుకో

ఆమెకి బోధపడలేదు. ఎవరైనా చూస్తే బాగుండదని ఆమెకి తటాలున అనిపించింది. తను ఎవరితోను అంత చనువుగా ఉండదు. ప్రకాశం లిఫ్టు ఇచ్చాడంటే ఎవరేమనుకుంటారో ! ఇక ఎప్పుడూ నడిచి పోకూడదని నీరజ తీర్మానించుకుంది. అయినా ఈ ప్రకాశం ఇలా తటస్థపడతాడని ఎవరనుకున్నారు ?

నీరజ ఆలోచనలతో విసిగించుకుంటుండగానే ఎగ్జిబిషన్ గ్రౌండు వచ్చింది. ప్రకాశమే రెండు

టికెట్లు తెచ్చాడు. అతని పక్కన నడుస్తుంటే నీరజ ముఖం ఎర్రబారింది. లేనిపోనిది తనే కొని తెచ్చుకుంది. ఇంటిదగ్గర డ్రాప్ చెయ్యమన్నా సరిపోయేది. తన అజ్ఞానానికి నీరజ చింతించింది. కాని ప్రకాశం లేశమాత్రమైనా సంకోచించకుండా ఆమెతో ఏదో నవ్వుతూ మాట్లాడుతూనే ఉన్నాడు. అది అమాయకత్వమో, గడుసుతనమో నీరజకి అర్థం కాలేదు.

ఇద్దరూ రకరకాల దుకాణాలనీ చూస్తున్నారు. ఎవరైనా స్నేహితురాలు కనిపిస్తే ప్రకాశం బారినించి తప్పించుకోవచ్చని నీరజ ఆత్రుతగా అందరి ముఖాలవైపూ చూస్తోంది. ఎవరూ కనిపించక పోయేసరికి ఆమెకి చిరాకు ఎక్కువైంది.

"అదేమిటండీ, షాపింగన్నారు, ఏదీ కొనరేం?" అన్నాడు ప్రకాశం వింతగా.

"తర్వాత మళ్ళీవస్తాను. ఇంక వెడతానండి." ఆమె ముఖం చిట్లించుకుని సమాధానం చెప్పింది.

"చిత్రప్రదర్శనశాల చూడరూ?" అన్నాడు ప్రకాశం.

చీకట్లో అకస్మాత్తుగా విద్యుద్దీపం వెలిగించినట్టయింది. తనెలా మర్చిపోయింది! చిత్రప్రదర్శనశాల! అందులో విశ్వం చిత్రాలుకూడా ఉన్నాయి. ఆమాట ఎంతో గర్వంగా చెప్పాడు విశ్వం. అప్పటినించీ ఎగ్జిబిషన్‌కివచ్చి ఆ చిత్రాలు తను చూడాలని అనుకుంటూనే ఉంది.

వాటిని తను చూడలేదనికాదు: మొదలు పెట్టినప్పటినించీ పూర్తి చేసేదాకా వాటిని తను కొన్ని వందలసార్లు చూసింది. కాని చిత్రప్రదర్శనశాలలో చూడటం వేరు.

"పదండి."

ఆనందాతిరేకంతో నీరజ చిత్రప్రదర్శనశాల వైపు నడిచింది. ప్రకాశం ఆమెని వెంబడించాడు. కాని ఆమె అతని ఉనికిని మర్చిపోయింది. ప్రదర్శనశాలలో ఎన్నో చక్కటి చిత్రాలున్నాయి – నీటి రంగుల చిత్రాలూ, తైలవర్ణ చిత్రాలూ. కాని నీరజ వాటిని సరిగా చూడనైనా లేదు. ఆమె కళ్ళముందు తాండవించేవి విశ్వం చిత్రాలు.

విశ్వం చిత్రాలు! రెండే రెండైనా అవి ప్రదర్శనశాలయావత్తూ విస్తరించి ఉన్నట్టు అనుభూతి పొందింది నీరజ. వాటివైపు అలాగే తన్మయత్వంతో చూడసాగింది. ఆమెకళ్లు ఆనందంతో మెరిసిపోతున్నాయి. ఆయిల్ కలర్స్‌లో ఎంత చక్కగా చిత్రించాడు విశ్వం! ఎంతభావస్ఫోరకంగా ఉన్నాయి. తనచిత్రాలుఎవరూ సరిగా అర్థం చేసుకోవటం లేదని నిరాశతో అలమటించి పోతున్నాడు విశ్వం. అతని కళలోని గొప్పతనాన్ని విమర్శకులు ఎందుకు కనిపెట్టలేకపోతున్నారు? ప్చ్. ఈ రోజుల్లో కళ ఎవడిక్కావాలి! ఆశ్రయం! అంతే! అది ఉంటే ఎవరైనా గొప్పవాడై పోతాడు.

అదిలేక విశ్వం అడుగునే మగ్గిపోతున్నాడు. అతని ఆత్మవిశ్వాసం సన్నగిల్లిపోతోంది. తనలో నిజంగా కళ ఉందో లేదోనని శంక అతన్ని పాతాళానికి కుంగదీస్తోంది. ఆ విషయం నీరజకి స్పష్టంగా తెలుసు.

నీరజకి కళ్లలో నీళ్లు తిరిగాయి. మరో విషయం ఆమెకి తట్టింది. విశ్వం చిత్రాలు ప్రముఖ స్థానంలో లేవు. కొన్ని చిత్రాలు అందరికీ వెంటనే కనిపించేవిధంగా ప్రముఖంగా వ్రేలాడగట్టారు. వాటిని చూస్తుంటే నీరజకి కోపం వచ్చింది. నిజానికి అవి విశ్వం చిత్రాల కంటె ఏవిధంగా బాగున్నాయి? పరీక్షగా చూడసాగిందామె. అలా చూస్తుండగా కొట్టొచ్చినట్టు "అమ్మబడినవి" అనే బోర్డులు చాలా చిత్రాలకి వ్రేలాడదీసినట్టు ఆమె చూపుల్ని అరికట్టాయి. విశ్వంచిత్రాలు "అమ్మకానికి" అని జాలిగా చూస్తున్నాయి. ఆమెలో ఏదో ఆవేశం కలిగింది. ఆ ఆవేశంలో ఒక భావం మిరుమిట్లు కొల్పేవిధంగా ప్రకాశించింది. విశ్వం చిత్రం ఒకదాని ఖరీదు మూడు వందలు. ఆమె వెంటనే ప్రదర్శనశాల ఉద్యోగి దగ్గిరికి వెళ్ళింది.

"విశ్వంగారి చిత్రం నేను కొంటాను. ఇవిగో మూడు వందలు" హ్యాండ్ బ్యాగ్ తీసి మూడువందల రూపాయలనోట్లు ఇచ్చింది నీరజ. ఆ ఉద్యోగి ఆమెవైపోసారిచూసి, రసీదుపుస్తకం తీశాడు. "పేరేమిటండీ?"

"నీ—" మాటమధ్యలోనే ఆపిందా నీరజ. ఊహు— తన పేరు బయటికి రాకూడదు. అందులో స్వారస్యం లేదు, రావలసిన ఫలితమూ రాదు.

"నీహారిక—మిస్ ఎస్. నీహారిక."

"అడ్రసు?"

ఏదో అడ్రసు చెప్పింది నీరజ. ఆమెవదనం జ్యోతి వెలిగించిన ప్రమిద అయింది.

"ఎగ్జిబిషన్ అయింతర్వాత చిత్రం మీకు పంపిస్తామండీ."

థాంక్స్ అన్నాడు ఉద్యోగిరసీదు ఇస్తూ.

"నేనే వస్తాలెండి." అంది నీరజ. రసీదు పుచ్చుకొని హాండ్ బ్యాగ్‌లో పెడుతూ.

ఇదంతా ప్రకాశం చిత్రంగా చూస్తున్నాడు.

"మిస్ నీహారికా! ఆ చిత్రంఖరీదు మూడు వందలా?"

ప్రకాశం స్వరంవిని, అతని ఉనికి మర్చిపోయిన నీరజ కొంచెం ఉలిక్కిపడి, సర్దుకుంది – నీహారిక!

"అది చాలా తక్కువ."

ఆమె వదనంలోకి నిదానించి చూశాడు ప్రకాశం.

"అవును. అదే నేననేది. అది కొనాలని నేను మొదటినుంచి చాలా మనసుపడుతున్నాను. ఐదు వందలిస్తాను. నాకది అమ్మకూడదా?"

నీరజ అతను ఎగతాళి చేస్తున్నాడేమో ననుకుంది.

"ఒప్పుకున్నట్లేనా? ఇవిగో

ఐదు వందలు." ప్రకాశం పర్సుతీసి నోట్లు సగం బయటికి తీశాడు.

నీరజ చకితురాలైంది. అది నిజంగా కళాభిమానమా? అలా అయితే ఆ చిత్రం కొనటానికి అంత కాలం అతనెందుకు ఆగవలసి వచ్చింది! ఆమెలో అనుమానం మొలకెత్తింది. నిస్సందేహంగా ప్రకాశం తనఅభిమానాన్ని చూరగొనటానికి ప్రయత్నిస్తున్నాడు. తన అంతస్తు అతనికి తెలుసు. తను సామాన్యురాలైన ఒక స్టెనో టైపిస్ట్. మూడువందలు పెట్టి ఒక చిత్రం కొనగలతాహతు తనకిలేదు. అలా కొనటానికి కారణం అతను ఊహించి ఉంటాడు. తను మారుపేరు చెప్పిన విషయమూ అతనికి తెలుసు. ఆ పేరుతో తనని సంబోధించాడు. ఒకవేళ విశ్వం అతనికి స్నేహితుడా? తను విశ్వాన్ని ప్రేమిస్తున్నట్టూ తెలుసా? విశ్వానికి అతను సహాయం చేయదలచుకున్నాడా? అందుకే తన మీద కూడా అభిమానం చూపిస్తున్నాడా? ప్రశ్నాపరంపర నీరజని వేధించ సాగింది.

"ఏమిటి ఆలోచిస్తున్నారు?"

నీరజ అతనివైపుదీక్షగాచూసింది. అతని కళ్ళలో నిజాయితీ కనిపించలేదు.

"క్షమించండి."

నీరజ ప్రదర్శనశాల బయటికి వచ్చింది. ప్రకాశం ఆమెని అనుసరించాడు.

"మీకు విశ్వంగారు తెలుసా?"

"ఉఁహుఁ" ప్రకాశంపెదవి విరిచాడు "ఆయనగొప్పచిత్రకారుడా?"

నీరజ అతనివైపు కనుబొమ్మలెత్తి చూసింది.

"ఆ మాట అడగవలసింది నేనేమో?" అందామె.

ప్రకాశం నవ్వాడు.

"అయిదువందలిస్తానన్నారు. మంచి చిత్రం కాకపోతే ఎందుకివ్వాలనుకున్నారు? మంచిచిత్రం వేసిన వ్యక్తి గొప్ప చిత్రకారుడుకాడా?" నీరజ ప్రశ్నించింది. కుతూహలం కంటె కోపం ఆ ప్రశ్నలో ప్రస్ఫుటమైంది.

"నాకు చిత్రకళగురించి ఏమీ తెలియదండీ. చిత్రాల బాగోగులూ తెలియవు. నేను ఆ చిత్రాన్ని కొనాలనుకోవటం–" అతను ఆగాడు.

"ఊఁ కొనాలనుకోవటం?" ఆమె రెట్టించింది.

"మీకు కానుకగా ఇవ్వాలనే."

నీరజముఖం ఎర్రబారటం ఆ పంజ చీకటిలోకూడా అతను గమనించాడు.

"అలాంటి ప్రసంగం ఎప్పుడూ చెయ్యకండి."

కొరడాతో కొట్టినట్టు అలాఅని నీరజ గబగబా నడిచి ఎగ్జిబిషన్ ఆవరణ దాటి వచ్చింది.

"రిక్షా"

"క్షమించండి" – డ్రాప్ చెయ్యవివ్వరా?"

"థ్యాంక్స్"

ఆమె రిక్షా ఎక్కింది. ప్రకాశం తల గోక్కొని కారు సమీపించి డ్రైవింగ్ సీట్‌లో చేరగిలబడ్డాడు, ఎంతసేపటికీ కారు రిక్షాదాటిపోలేదు. నీరజ కుతూహలంతో వెనకవెనక్కి చూసింది. కారుఇంకా అక్కడే ఉంది.

ఈ పానకంలో పుడకని మర్చిపోవాలని ప్రయత్నిస్తూ నీరజ ఇల్లు చేరింది. త్వరత్వరగా స్నానం చేసింది. తెల్లచీర కట్టుకుంది. – ఏదో తృప్తి ఆమె మనసుని ఆవరించింది. ఎనిమిదింటికల్లా విశ్వం వస్తాడు. రోజూ సాయంత్రం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కి వెళ్ళి, ప్రదర్శన శాలలో తన చిత్రాల్ని ఎవరైనా కొన్నారేమో కనుక్కోటం, నిస్పృహతో తిరిగిరావటం, ఆత్మవిశ్వాసం కోల్పోతున్నట్టు విశ్వం మాట్లాడటం మామూలే. ఈ రోజు –

నీరజ సంతోషానికి పట్టపగ్గాల్లేవు. అతనిలో చైతన్యం కలుగుతుంది. ఆత్మవిశ్వాసం కొడిదులిపిన దీపంలా వెలుగుతుంది. ఎంతో మంచి బొమ్మలు వేస్తాడు. గొప్పకీర్తి సంపాదిస్తాడు. అప్పుడు – ఒక చల్లని ఉదయాన– ఉఁహు – సాయం సమయాన తను చెప్పేస్తుంది. – ఆ కొడి దులిపినదెవరో! అప్పుడు చూడాలి. ఆ కళ్ళలో తళుకు! ఆ వదనంలో దీప్తి!

తలుపు చప్పుడైంది.

హృదయం వేగంగా కొట్టుకుంది.

తలుపు తీసింది. ఓరగా, వయ్యారంగా నిలబడ్డది.

అతని కళ్ళలోని ప్రకాశం తళుక్కువాలి.

విశ్వం తలుపు తోసుకొని, ఓసారి నీరజవైపు యధాలాపంగా చూసి పేముకుర్చీలో కూలబడ్డాడు. ఏమిటలా నిరుత్సాహంగా ఉన్నాడు! ఒకవేళ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌కి వెళ్ళలేదా? నీరజ మనసులో సందేహం కలిగింది.

"ఏమిటి బావా, విశేషాలు?" అంది ఆశగా.

"దరిద్రుడి తలకడిగితే వడగండ్ల వానట." విశ్వం నిట్టూర్చాడు.

నీరజ గుండెలో ఏదో భయం గూడుకట్టుకొంది.

"ఏం జరిగింది"

"ఆ మధ్య నేను రెండు ఆయిల్ పెయింటింగ్స్ వేశాను. ఒక చిత్రం పేరు 'ఉదయం'. రెండోదాని పేరు 'అస్తమయం'. నీకు తెలుసు కదూ? వాటిని ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నారని కూడా చెప్పాను. వాటిలో 'అస్తమయం' అనే చిత్రాన్ని ఎవరో మూడొందలిచ్చి కొన్నారట,"

"మూడొందలే! ఆ బొమ్మ అంత చేస్తుందా?" ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది నీరజ.

"మరేమిటనుకున్నావు?" అని ఆత్మవిశ్వాసం ఉట్టిపడేట్టు అంటూ గర్వంగా తన కళ్ళలోకి చూస్తాడని

ఆశపడుతూ నీరజ విశ్వం వైపు క్రీగంటు చూసింది. విశ్వం అలా అనలేదు.

"రెండు చిత్రాలకి ప్రకాశం అనే ఒకాయన వెయ్యి రూపాయలిస్తానన్నాడు. అయితే సెట్టుగా గాని తీసుకోడట. ఏంలాభం? మంచి అవకాశం పోయింది." విచారంగా అన్నాడతను.

నీరజ వదనం గట్టున వేసిన తామర పువ్వులా వాడిపోయింది.

"ఆయన్ని ఎరుగున్నావు కాబోలు." అందామె.

"ఓ గంట క్రితమే చిత్ర ప్రదర్శనశాలలోనే పరిచయమైంది. బాగా డబ్బున్నవాడుగా కనిపిస్తున్నాడు."

నీరజకి చిరాకేసింది.

"నీకు కావలసింది డబ్బా, ఆర్టా?" అంది విసుగ్గా.

"నీకు తెలియదు నీరజా. వెయ్యి రూపాయలంటే సామాన్యమా? నా చిత్రం కొన్నది ఎవరో నీహారికట. గాంధీనగరంట. ఫలానా వీధి అని తెలియదు. ఎలా కనుక్కోటం?"

"ఎందుకు?"

"ఓ వంద ఎక్కువిస్తే మళ్ళా ఆ చిత్రం మనకి అమ్మేస్తుందేమో."

అతనివంక నీరజ నిశ్చలంగా చూసింది. మొదటి సారిగా అతనంటే ఆమెలోఏదో విరక్తి కలిగింది. డ్రాయరు తెరిచి హ్యాండ్‌బ్యాగ్‌ను చేతిలోకి తీసుకుంది. రసీదు తీసింది.

అది ఆమెచేతిలో నలిగిపోసాగింది. చేరెడేసి కళ్ళలో ఎర్రజీర వచ్చింది.

విశ్వంలో ఆత్మవిశ్వాసాన్ని పునరుద్ధరించాలని తను ప్రయత్నించింది. అతనిలో దురాశని రెచ్చగొట్టటానికి ప్రకాశం పూనుకున్నాడు. ప్రకాశం నేర్పుగా వలపన్నగల సమర్థుడు. ఆ విషయంలో సందేహించాలిసిందేమీ లేదు. తను డబ్బుతో కొనలేనిదేదీ లేదని నిరూపించటమే అతని ఆశయం కాబోలు.

కాని విశ్వంవ్యక్తిత్వం ఇంతేనా? ఆమెలో ఏదో నిస్పృహ కలిగింది. చేతిలోని రసీదుని అతనివైపు గిరవాటేసి "నీహారికవల్ల నీకేం ప్రమాదం రాదు. ఆమె హృద్రోగంతో హఠాత్తుగా చచ్చిపోయింది. ఆమె కొన్న బొమ్మని నీ ఇష్టంవచ్చినవాళ్ళకి ఇష్టం వచ్చినంత ధరకి మళ్ళీ అమ్ముకోవచ్చు' అనాలని మనసులో రిహార్సలు వేసుకుంది. కృతనిశ్చయంతో అతనివైపు తీక్షణంగా చూసింది. ఉఁహుఁ—అలాకాదు. ఆ మాటలకి అతను చలించినా గాయపడకపోవచ్చు. "అలా కుంగిపోతావేం? నీహారిక ఎవరోకాదు నేనే" అని వెల్లడించేస్తే! తల్లడిల్లి తెల్లబోయి ముఖం చూడలేక — ఉఁహుఁ— నీరజ అశాంతితో వేగిపోసాగింది.

"నీరజా, ఆమె ఎవరో నువ్వు కనుక్కోగలవా?" దీనంగా అన్నాడు విశ్వం.

ఆమె పకాలున నవ్వింది.

"నీకు నవ్వులాటగా ఉంది కదూ?"

"కాదు. ఆమాట మొదటే అడక్కూడదూ?"

"ఏం, నీకామె తెలుసా?" ఆశగా ఆమెదగ్గిరికి వస్తూ అడిగాడతను.

"తెల్సు. ఆమె మా ఆఫీసులోనే స్టెనో టైపిస్టు. నాకు బెస్టు ఫ్రెండ్" తడుముకోకుండా చెప్పింది నీరజ.

"నిజం?"

"ముమ్మాటికీ."

"అయితే ఈ సహాయం చేసి పెడతావుకదూ?"

"తప్పకుండా. మా ఇద్దరిదీ ఒక్కటే మాట."

విశ్వం ముఖంలోకి కళవచ్చింది.

"అబ్బ. ఎంతఏడిపించావు నీరజా! ముందే ఆ మాట చెబితే నోటి ముత్యాలు రాలిపోతాయా?" హుషారుగా ఆమాటలని ఈలవేస్తూ విశ్వం లోపలికి పోబోయి మళ్ళీ ఆగి "అన్నట్టు మీ ఫ్రెండ్ నీహారికే ఈమె అని ఎలా చెప్పగలం?" అన్నాడు సందేహంగా.

"ఇద్దరూ ఒకరే." అంది నీరజ దృఢంగా.

"ఎలా తెలుసు?"

అకస్మాత్తుగా ఏదో బలహీనత ఆవరించినట్టయి నీరజ తటాలున చెయ్యిచాపి "ఇదిగో, గుప్పిట్లోఉంది రహస్యం, చూసుకో" అంది.

విశ్వం తెల్లబోయాడు. ఆమె తనని ఏదో ఆటపట్టిస్తోందని అతను చిన్నబుచ్చుకున్నాడు. నిరాశకూడా అతని వదనాన్ని ఆవరించింది. మేఘావృతమైన శశిబింబంలా అతను కళతగ్గి దీనంగా కనిపించేసరికి నీరజ హృదయంలో దేవినట్టయింది. చప్పున చెయ్యి వెనక్కి లాక్కుంది.

"అలా తెల్లబోతావేం బావా? ఆమె చిత్రం కొన్నప్పుడు నేనక్కడే ఉన్నాను. నీ చేత చెప్పిద్దామని తమాషా చేశాను, అంతే. నామాట నమ్ము" నిజాయితీ ఉట్టిపడే స్వరంతో అంది నీరజ. ఆమెకళ్ళు చెమ్మగిల్లాయి. ఆమె పరిస్థితిని గమనించలేని విశ్వం తృప్తిపడ్డాడు. అతని పెదవులమీద చిరునవ్వు చిందులాడింది.

"ఏమోమరి. నీబహుమానంమర్చిపోనులే నీరజా" అంటూ విశ్వం లోపలికి వెళ్ళాడు.

అతను వెళ్ళగానే నీరజ గుప్పిలి తెరచి, రసీదుని జాగ్రత్తగా మడిచి హాండ్ బ్యాగ్‌లో పెట్టింది. కళ్ళు తుడుచుకోబోయి విరమించింది. ఆ అవసరంలేదు. బేరసారాలతోనిండిన ఈ ప్రపంచంలో ఎన్నటికీ గుర్తింపబడని కొన్ని అసలు విలువల్లా, ఆమె కన్నీరు అప్పటికే ఇంకిపోయింది.

***